# చివురు-వెన్నెల

సకల కళాపారంగతులు, సర్వలోక రక్షకులు, శౌర్యధనులు అయిన దొడ్డ దేవరాయలవారు, ముత్యాలశాలలో, పండిత గాయక బృందము బలసి కొలువై ఉన్నతరుణాన, వెలనాటి గరుడపక్షి, ఒక్కనాడు ఎగిరి ప్రదక్షిణంగా రాగలిగినంత సీమను పరిపాలించుతూన్న గండు కాటమ నాయకుడు, 'మీ కన్నెను, మా కోడలినిగా చేసుకుంటా'మని, కులగురువుల చేత వర్తమానం చేయగా – రాయలవారు ఆ వియ్యము తమకు సమ్మతమే కనుక, కన్నె మనసు తెలుసుకునేందుకు, చిరంజీవి చిక్క విరుపాజి, ఎండ కన్ను తెరవని నీడను, ఏకాంతవాసంగా, కళకో చెలిమికత్తెగా, అరవైనాలుగు నెచ్చెలులతో నెచ్చెలికి పదుగురేసి ఊడిగపు పడతులతో, నిత్యవినోదవైభవాలతో ప్రాయపుపొద్దులు గడుపుతూఉన్న కుంజవనికి దయచేసినవాడై, వెన్నెల సానబెట్టిన మంచు చినుకల్లే, పూరేకలు మలచిన పుప్పొడి పుణికల్లే, చాముండీశ్వరి ముక్కెర రవతళుకల్లే, మరుల సిరులున్న మహాశ్వేతల్లే, తామరవెల్ల తనువు కల్గిన శారదల్లే, పాలకడలి కడుపు పొంగల్లే, చంద్రకాంత వీధుల్లో – విరిసినపూవుల్లో పూవుగా కలసిమెలసి నడయాడుతున్న కన్నె-కుమారిని తిలకించినవారై-వైన మీ తీరమ్మా అని ఎరుగజెప్పి – ఏమమ్మా నను కన్నతల్లీ! నీ ముచ్చట లేమమ్మా! అని పలుకరించగా,

ఆ అపరంజి తీవె – కిన్నెర మీటుగా ఉలిక్కిపడి – తొంగలి ఱెప్పలు మౌనంగా, సిగలో గొజ్జంగి చేత నందు కున్నదై, తండ్రి వంక చూసి, చిరునవ్వులో సిగ్గుపడి – చెలుల సందిట జేరి, శిరస్సుతో ఔను-కాదని-అందని సమాధానం ఇచ్చింది.

రాయలవారు ముత్యాలశాలకు తిరిగి వేంచేసినవారై, కాటమనాయకుడి కుల గురువులను ఘనంగా సత్కరించి, మా అభిమతం అనువైనంత వేగిరం వర్తమానం చేయగలవారమని విన్నవించుకుని, వారి ఆశీస్సులందుకుని, సాగనంపిన వారైనారు.

ఆపై, నెలప్రొద్దులు గడచినవి.

గోరు వెచ్చని చలి.

కన్నె లందరు కాత్యాయనీ వ్రతం పట్టే పండుగ రోజులు. రాయలవారు, ఒక కన్నెను కుంజవనినుంచి సముఖానికి రప్పించుకుని, చిరంజీవిమనసేమో తెలియజెప్పమన్నారు. ఆ ప్రౌఢ అంజలించి పలుకరించినప్పుడల్లా చిన్నది చిరునవ్వు నవ్వుతూన్నదయా! కామిత మేమమ్మా అన్నపుడల్లా కనులరమోడ్చి, లీలా కమలంతో మమ్మల్ని కోమలంగా మందలించుతూన్నదయ్యా! కలకాలమూ కన్నెతనమే నీకు ముచ్చటా, ఐదువరాలివి కావా? అని కసురుకోగా, చివురుల వంటి మునివేళ్ళతో, చెక్కిలి పుణికి హంసనడకలు నడుస్తూన్నదయ్యా! కన్నె మనసేమో మాకు తెలియరాలేదు! ఏమమ్మా తెలియజెప్పవమ్మా అని అందరమూ కలసి కవ్వించగా – కన్నె లేడిని తరిమి పట్టుకుని – కలకల నవ్విందయ్యా! – అని మనవిచేసుకోగా –

రాయలవారు కన్నె తీరుతీయములన్నీ విశదంగా, కాటమనాయకుడికి కమ్మ వ్రాయించినవారైనారు.

"మా చిరంజీవి, కమ్మను కనుల కద్దుకుని, మా ముగుదల అందుకుని, ఎటకో పయనమై పోయినాడు, ఏదో దివ్యక్షేత్రానికట" అని – జాబుకు జవాబు వచ్చినది. రాయలవారు చిన్నబుచ్చుకున్నారు.

సంక్రాంతి తరలిపోయి – పోయిపోయి – సంవత్సరాది చేరువౌతూండగా – కుంజవనిలో – కన్నెలందరితోనూ కలసి చిక్క విరుపాజి – కామదేవ ఆరాధనకు – పూలసంభరాలు సమకూర్చుకునే తొలిపొద్దున మాధవీ మంటపము చెంగట ఎలమావినీడను పద్మాసనంతో, చిన్ముద్రతో, సౌభరికి అపరావతారమైన ఒక తేజోమూర్తి, బవిరిగడ్డంతో వెన్నెల రాపాడే జటాజూటంతో బంగరు విగ్రహంగా పొడకట్టగా – విరుపాజి అప్రయత్నంగా నమస్కరించి – అంతలో దిటవు తెచ్చుకుని – కనుసన్నతో చెలులను హెచ్చరించగా – నెచ్చెలులు ఆరెకులను పిలువనంపగా – ఆ తాపసికి ధ్యానభంగమైనది.

అంతఃపురోద్యానం పురుషులు ప్రవేశింపరాదని ఎరుగడా? –

ఎరుగడు. ప్రశాంత రమణీయ ప్రదేశాలన్నీ అందరికీ అనుభవ యోగ్యములే కదా!

లేడి కూనలకు లేని కట్టడులు, మానవుల కెందుకూ?–మహారాజులు మతిమంతులు కారా? తాపసి పలుకులకు విరుపాజి ఉలికిపడినది. ఆరెకులను మరలిపొమ్మని – అతడిని సాగనంపమని, నెచ్చెలులకు ఆదేశించింది. ఒక్క గడియ ఉండనీయమన్నాడు. కావలసిన పూవులన్నీ తెప్పించుకుని – పోసిన రాసులన్నీ – గడియలో, కామదేవమూర్తిగా – తన రూపున చిత్రించి – రాకుమారికి – దీవెనగా దయచేసి – అక్కడ నిలువకుండా తరలిపోయినాడు.

ఆ చిత్రశోభకు కన్నెలందరూ – నివ్వెర పోయినారు. అలనాటి అర్జునుడు కాడుగద! అనుకున్నారు. విరుపాజి గంభీర మౌనముద్ర వహించింది.

రాయలవారు ముత్యాలశాలలో కొలువైవుండగా – ఈ తాపసి, అచ్చటికి దయచేసి – సమ్మానితుడై – దేవర అభీష్టమేమని – రాయలవారు మనవిగా ప్రశ్నించగా – మానెడు మల్లెలు, కుంచెడు జాజులు, రాసెడు మందారలు, అరయోజనం తామర తూడులు, వేయిన్నొకటి తామరపూవులు, నిలివెడు పుప్పొడీ–నిండు కలశంతో జంటితేనె ఒనగూర్చితే – దేవర అభీష్టమూ, తన అభీష్టమూ సిద్ధించునని తాపసి సెలవీయగా–

రాయలవారు – వారు కోరిన దినుసులన్నీ ఒక్క ముహూర్తంలో సమకూర్చగా – తాపసి ఆ తావున ఏడు గడియలు ఏకాంతంగా ఉండవలెనని, అభిలషించగా, – రాయలవారు తపసి కోరిక శిరసావహించినవారై – అభ్యంతర మందిరానికి వేంచేసి, దేవబ్రాహ్మణ పూజలు ముగించుకుని – బంగారు పళ్ళెరంలో – కళసాపురంనుంచి అప్పుడే వచ్చిన, కదళీ ద్రాక్షలూ, అరకాచిన గోక్షీరమూ ఉంచుకున్న వారై–తిరుగ ముత్యాలశాలకు విచ్చేయగా...

అక్కడి స్థితి ఏమిటి?

పూలరాసులూ పుప్పొడి మాయమైనవి!

అక్కడ మరి – ఏమున్నదయ్యా!–

అరవై అయిదు పూల తేరులు!–

తేరుకో పుప్పొడితో మలచిన కన్నె-

కన్నెకో వెల్ల తామర గొడుగు-

తొలి తేరుకు, రెండు ఛత్రాలు.

ఒక్క ఛత్రం క్రింద - చిక్కవిరుపాజిమూర్తి - ఆసరసను ఛత్రం నీడను - మీవిరుపాజికి వరుడయే ధన్యమూర్తి నిలవాలి, మహారాజా! అన్నాడు తాపసి. కన్నెకు కబురంపవయ్యా! అన్నాడు.

చిక్క విరుపాజి, ఈ చోద్యం చూడటానికి - మన్మథుడి పట్టువదలిన శరవేగంతో అక్కడకు వచ్చి, ఓ కంటను ఆ చిత్రం చూసి - ఓ కంటను దీక్షగా తపసిని చూసి తండ్రిని చూసి తల ఊచి, ఒక్క గడియ గడువిస్తే-వారు కోరినది, కనులు కట్టేట్టు చేస్తానని మనవిచేసి - గడియలో కుంజవనిలో, దర్శనం యిప్పించమన్నది.

మరో గడియకు, రాయలవారూ, తపసీ కుంజవనకి దయచేయగా - అక్కడ -

తనకు మొక్కుతూన్న తపసీ - తన కౌగిలిలో ఉన్న తరుణుడూ - ఆ మూర్తులను, జాజుల తెర తొలగించి - తిలకించమని మనవిచేసింది విరుపాజి.

తపసికి తన కన్నె అపచారం చేసిందని, రాయలవారు ఉగ్రులైనారు. తపసి పాదాలంటబోయినారు. కన్నె - యీ కలవరపాటు చూసి-కలకలలాడింది. తపసి, మెప్పుగా తల ఊగించినాడు. పుష్పమూర్తికి అమరించిన జాజుల బవిరి గడ్డము సడలించినాడు. తపసీ - తరుణుడూ ఒక్కరే!

తామెవరు స్వామీ! - అన్నాడు రాయలవారు అర్థం చేసుకుంటూ-

కాబోయే అల్లుణ్ణికద! అన్నాడు తపసి-

కాటమనాయకుడి కుమారుడికి కన్నెనివ్వాలని నిశ్చయించుకుంటినే -అనుకున్నాడు-రాయలవారు. ఆ సంగతి మనవిచేసి - సర్వసంగపరిత్యాగులు-కామినీ వ్యామోహంలో పడటం సమంజసము కాదేమో - అన్నాడు.

కన్నె లభించకపోతే - సన్యాసినేకదా ప్రభూ! మీ కుమారి కాటమనాయకుడి కోడలే - ఆమె నేర్చిన విద్యలే నేనూ నేర్చానని మనవి చేయడానికీ, మనసీయడానికీ - ఇంత దూరం తరలివచ్చానయ్యా! వచ్చింది, మీ సిరులూ సంపదలూ చూసి కాదయ్యా! ఆ కన్నె చిరునవ్వుకోసమయ్యా - అని మనవి చేసుకోగా - రాయలవారు బ్రహ్మానందభరితులై - మంచి ముహూర్తాన చిక్కవిరుపాజిని, చిరంజీవి శౌరినాయకుడికి కన్యాదానం చేసినవారైనారు.

అనాడు శౌరినాయకుడు - పూవులతో కల్పించిన మూర్తులు - మరునాటికే వసివాడిపోయినవా? - లేదు - తేనె, పుప్పొడి - గోరోజనం - కస్తూరి - గైరికమూ - సాంబ్రాణి - పాలతోగలిపి పూతపూయగా, చెక్కు చెదరక - రేకు రేకుగా - అప్పుడే విరిసిన పరిమళం నిలుపుకుంటూ - ఎన్ని సంవత్సరాలో, అలా ఉండిపోయినవయ్యా! చివరకు ఒక దుర్ముహూర్తాన - తురుష్కులు ఆ దివ్యకల్పనను ధ్వంసం చేశారయ్యా!-

కాని, ఈనాటికీ కన్నడ కన్నెలు పూవులతో మలచినట్టు సుకుమార కోమలాంగులుగా ఉండటం - కన్నెలకు పూవులంటే తగని మమత, అలనాడు చిక్కవిరుపాజి చేసుకున్న పుణ్యమేనయ్యా! ★ ★ ★